తెలుగు దినపత్రిక

RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY


ఇన్నాళ్ళకు మళ్లీ ఊపేసింది..

ఈ బ్యూటీ దెబ్బకు థియేటర్స్‌లో దుమ్ముదుమారం

మిగతాది 8లో

ఇదండీ..కబురు..



పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా ఈ రోజు వంట బంద్..!


సంపుటి : 23 సంచిక : 116 | శనివారం ఏప్రిల్ 12 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5


# ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ

- ఇందుకు అనుగుణంగా డిపిఆర్ సిద్ధం చేయాలి
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం



కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 11

ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోను విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సీఎంతో పాటు సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ముఖ్యమంత్రి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు- అధికారులు వివరించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (36.8 కి.మీ.),రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్-చాంద్రాయణ గుట్ట (7.5 కి.మీ.), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్‌బీ నగర్-హయత్ నగర్ (7.1 కి.మీ.) మొత్తం 76.4 కి.మీ.ల విస్తరణకు రూ.24269 కోట్ల అంచనాలతో డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రంతో పాటు- రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవెలప్మెంట్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరించేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ- అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్ఖాన్‌పేట వరకు పొడిగించాలని చెప్పారు. అందుకు అవసరమయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలని సూచించారు. హెచ్‌ఎండీఏతో పాటు ఫ్యూచర్ సిటీ- డెవెలప్మెంట్‌అథారిటీని ఈ రూట్ మెట్రో విస్తరణలో భాగస్వామ్యులను చేయాలని చెప్పారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు

- ఆర్థిక నేరానికి తెరలేపిన రేవంత్ ప్రభుత్వం
- 400 ఎకరాలు పక్కాగా అటవీ భూములే
- దానిపై రుణాలు ఎలా తెచ్చరో చెప్పాలి
- దీనిపై సిబిఐ విచారణ జరగాల్సిందే
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ డిమాండ్

కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 11

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం అనే 3డీ మంత్రంతో పాలన చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు జరుగుతున్నాయని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని చూసి దేశం మొత్తం విస్తుపోయిందన్నారు. ఆ 400 ఎకరాలు అటవీ భూమేనని, సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా ఆ విషయాన్ని చెబుతున్నానని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ భూముల వెనుక 10 వేల కోట్ల ఆర్థిక కుంభకోణం ఉందన్నారు. కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఆరోపించారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసే భారీ ఆర్థిక నేరానికి పాల్పడ్డారని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఒక బీజేపీ ఎంపీ సహకారంతో ఈ స్కామ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ట్రస్ట్ ఎడ్వైజర్స్ ఇన్వెస్ట్మెంట్ అనే కంపెనీ రేవంత్ రెడ్డికి బ్రోకరిజం చేసిందన్నారు. అందుకు గాను .. సదరు కంపెనీకి రూ.170 కోట్లు లంచం ఇచ్చారన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, ఆర్బీఐ గైడ్‌లైన్సులను తుంగలో తొక్కారని చెప్పారు. అటవీ భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. అటవీ భూమిని తాకట్టు పెట్టడం, అమ్మే అధికారం ప్రభుత్వానికి కూడా లేదన్నారు. వాల్టా, ఫారెస్టు చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘించింది. బీజేపీ ఎంపీ సారధ్యంలోనే బ్రోకరేట్ కంపెనీ తీసుకొచ్చారు.

మిగతాద్ది 2 లో

# ప్రజల సంక్షేమానికి అంకితమైన ఇందిరమ్మ ప్రభుత్వం

- ప్రగతి భవన్‌ను జ్యోతి రావు పూలే భవనంగా మార్చాం
- అంబేద్కర్ జయంతి రోజు భూభారతి ప్రజలకు అంకితం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



2 లో

కబురు న్యూస్,రాజన్నసిరిసిల్ల,ఏప్రిల్ 11

ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అంకితమై పనిచేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి మాట్లాడుతూ ప్రగతి భవన్‌ను జ్యోతి రావు పూలే భవనంగా మార్చిన ఘనత కూడా ఈ ప్రభుత్వానిదేనని అన్నారు. ఇది ప్రజలకు గౌరవం ఇచ్చే ముఖ్యమైన చిహ్నంగా నిలుస్తుందన్నారు.గత ప్రభుత్వ హయాంలో ధరణిలో చోటుచేసుకున్న అవకతవకలన్నీ సరి చేయడం కోసం కొత్త భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు. ఈ చట్టాన్ని తీసుకురావడమే కాకుండా, మూడు నెలలు కూడా పూర్తవకముందే దానికి సంబంధించిన విధానాలు రూపొందించడంలో ప్రభుత్వం చూపిన వేగాన్ని మంత్రి వివరించారు.



2 లో

# భారత్,చైనా సుంకాల గొడవ

## భారత్ అప్రమత్తంగానే ఉందన్న జైశంకర్

కబురు న్యూస్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 11

అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతుంది. దీంతో ప్రపంచం తీవ్ర గందరగోళానికి గురైతుంది. ఇక, ఈ వివాదంపై న్యూఢిల్లీలో జరిగిన కార్నెగీ ఇండియా గ్లోబల్ టెక్నాలజీ సమ్మిట్‌లో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ.. భారతదేశం తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి సిద్ధంగా ఉందని అన్నారు. రెండు అతి పెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య పరంగా నువ్వానేనా అన్నట్లుగా సుంకాల యుద్ధం సాగుతోందన్నారు. జనవరి 20వ తేదీన డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగాఅధికారం చేపట్టిన వెంటనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం వాషింగ్టన్‌తో చర్చలను వేగవంతం చేశామని కేంద్రమంత్రి జైశంకర్ అన్నారు.

# అభివృద్ధి..వారసత్వం లక్ష్యంగా పయనం



2 లో

- 2036 ఒలంపిక్స్ కోసం భారతయత్నం
- విపక్షాలది కుటుంబ రాజకీయం
- వారికి అభివృద్ధి కన్నా స్వప్రయోజనాలే ముఖ్యం
- వారణాసిలో పలు అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం
- ఇటీవలి అత్యాచార ఘటనపై అధికారులతో ఆరా

కబురు న్యూస్,వారణాసి,ఏప్రిల్ 11

భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో ముందుకువెళ్తోందని ప్రధాని మోడీ అన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు.శుక్రవారం ఆయన తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

# అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు

- సిపిఎం మద్దతు కోరిన ఎమ్మెల్సీ కవిత



కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 11

బహుజనుల సాధికారతకు ప్రతీకగా పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ప్రతిష్టించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. అసెంబ్లీలో పూలే విగ్రహ ఏర్పాటు సాధనకై అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మద్దతు కూడగట్టామన్నారు.

02

# తెలంగాణ తెచ్చుకుందే ఉగ్యోగాల కోసం

- వరంగల్‌లో మెగా జాబ్ మేళా ప్రారంభించిన మంత్రులు
- త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్
- వెల్లడించిన మంత్రి సీతక్క



2 లో

కబురు న్యూస్,వరంగల్, ఏప్రిల్ 11

తెలంగాణ తెచ్చుకుంది ఉద్యోగాల కోసమేనని మంత్రి సీతక్క తెలిపారు. వరంగల్ ఎంకే నాయుడు కన్వెన్షన్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించగా, మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన వచ్చిందని అన్నారు.

# ఊపిరి పీల్చుకున్న స్టాక్ మార్కెట్లు

- లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు



2 లో

కబురు న్యూస్,ముంబై,ఏప్రిల్ 11

దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేయడంతో ట్రేడర్ల ఉత్సాహంతో స్టాక్ మార్కెట్లు భారీ లాభాలలో ముగిసాయి. ట్రంప్ ప్రభుత్వం అదనంగా విధించబోయే ప్రతీకార సుంకాలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు- ప్రకటించడంతో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించింది.

## జోడోయాత్ర ద్వారా రాహుల్ గాంధీ ఐక్యతకు నాంది పలికారు... మధుసూదన్ రెడ్డి



**కబురు న్యూస్ బాన్సువాడ ఏప్రిల్ 11**
ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ చోడో యాత్ర ద్వారా దేశవ్యాప్తంగా ఐక్యత భద్రత సమానత్వానికి నాంది పలికారని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామంలో జై బాబు జై భీమ్ జై సంవిధాన్



కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పలు కాలనీలు తిరుగుతూ రాజ్యాంగం యొక్క విశిష్టతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మహిళలు దళితులు ఆదివాసీలు సామాజికంగా బలహీన వర్గాల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసుల రోహిత్, సొసైటీ చైర్మన్ గంగుల గంగారం, మాజీ వార్డు సభ్యులు కుమ్మరి రాజు, లక్ష్మా గౌడ్, రాజు విట్టల్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిబాపూలే అందరికీ ఆదర్శప్రాయుడు... షేక్ జూబేర్



**కబురు న్యూస్ బాన్సువాడ ఏప్రిల్ 11**
మహాత్మ జ్యోతిబాపూలే అందరికీ ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయాలను అనుసరించాల్సిన అవసరం మనందరిపై ఉందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ అన్నారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే దేశానికి ఎంతో సేవ చేశారని, సమాజంలో బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఆయన చేసిన కృషి ఏనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోచి గణేష్, సాయిబాబా, రమేష్ యాదవ్, శివసూరి, సంజయ్ యాదవ్, చాకలి సాయిలు, మహేష్, మౌలా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## జ్యోతిబాపూలే చేసిన సేవలు ఎనలేనివి... సబ్ కలెక్టర్



**కబురు న్యూస్ బాన్సువాడ ఏప్రిల్ 11**
బాన్సువాడ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి సబ్ కలెక్టర్ కిరణ్మయి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే గొప్ప సంఘసంస్కర్త అని, దేశానికి ఎంతో సేవలు చేశారని ఆయన అడుగుజాడల్లో ఆయన ఆశయాలను నెరవేరుద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, తహసిల్దార్ వరప్రసాద్, ఏవో సువర్ణ,ఆర్ఐ అశోక్, హన్మాండ్లు, జగన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాయి ఆదర్శ యువతి మండలి ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి...

**కబురు న్యూస్,బోధన్ ఏప్రిల్ 11..**
సాయి ఆదర్శ యువతి మండలి ఆధ్వర్యంలో జ్యోతి బా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జ్యోతి బాపులే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ




కార్యక్రమంలో ఆదర్శ యువతి మండల అధ్యక్షురాలు పద్మాసింగ్, సాయి చరణ్, ఉసేన్, శంకర్, రాధ, గంగమణి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా చైతన్యానికి పాటుపడిన దార్శనికుడు

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 11 :**
సమాజం బాగుపడాలంటే మహిళా చైతన్యమే ముఖ్యమని దాదాపు రెండు వందల సంవత్సరాల క్రితమే గ్రహించిన గొప్ప దార్శనికుడు మహాత్మ జ్యోతిబాపూలే అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సుధాకర్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ జంక్షన్ వినాయక్ నగర్ వద్ద గల పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే కేవలం బడుగు బలహీనవర్గాలకె సేవ చేయలేదని గుర్తు చేశారు. సమాజంలో వెనుకబడిన ప్రతి ఒక్కరి గురించి పోరాడిన గొప్ప నాయకుడు మహాత్మ జ్యోతిబాపూలే అని



పేర్కొన్నారు. అగ్రవర్ణాల పేదలకు,వితంతువుల కొరకు ఎస్సీ ఎస్టీ బిసి ఇలా ప్రతి జాతి కొరకు,ప్రతి కులం వారి కొరకు పోరాడిన ఏకైక వ్యక్తి మహాత్మ జ్యోతిబాపూలే అని గుర్తు చేశారు. తన భార్యకు విద్యను నేర్పి తన భార్యను భారత దేశ ప్రథమ ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన గొప్ప దార్శనికుడు మహాత్మ జ్యోతిబాపూలే అని అన్నారు. సమాజం బాగుపడాలంటే మహిళా చైతన్యం ముఖ్యమని,మహిళా చైతన్యం విద్యతోనే సాధ్యమని గ్రహించి ఆ విధంగా మహిళలకు విద్యను నేర్పించిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే అని అన్నారు. మహిళలు బాగు పాడితే కుటుంబం బాగు పడుతుందని అని చెప్పి తన భార్య ద్వారా మహిళలకు విద్యను నేర్పిన విద్య ప్రదాత భారతదేశ ముద్దుబిడ్డ మహాత్మ జ్యోతిబాపూలే భారతదేశానికొక గొప్ప వరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్,బుస్స ఆంజనేయులు,ఆకుల ప్రసాద్ కరిపే రవిందర్,దర్శనం దేవేందర్,కొయ్యాడ శంకర్,మాడవేడి వినోద్ కుమార్,పోల్కం గంగాకిషన్,శ్రీలత,సత్య ప్రకాష్,విజయ్ బగ్గలి అజయ్ ,చంద్రమోహన్, కోడూరు స్వామి,బసవ రాజు,నరసయ్య బాలన్న తదితరులు పాల్గొన్నారు.

## బాలికను హింసించిన సవతి తల్లిపై ఫిర్యాదు చేసిన ఐద్వా నాయకులు

**కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,ఏప్రిల్ 11 :**
నాగారం కు చెందిన 13 ఏళ్ల బాలికను హింసించి ఆస్పత్రుల పాలు చేసిన సవతి తల్లి రిజ్వానా బేగం,తండ్రి షేక్ హుస్సేన్ పై ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత ఆధ్వర్యంలో ఐదో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదు సంవత్సరాల క్రితం తల్లి చనిపోవడంతో తండ్రి మరో వివాహం చేసుకోవడంతో ఆ బాలికకు సవతి తల్లి ఐదు సంవత్సరాలుగా బాలికను తీవ్రమైన వేధింపులకు గురిచేస్తోంది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ,నాగారంలోని బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన షేక్ హుస్సేన్ కు నేహా కౌసర్ అనే కూతురు ఉందని,హుస్సేన్ మొదటి భార్య కూతురైన నేహా కౌసర్ ను సవతి తల్లి రిజ్వానా బేగం రాచిరంపాన పెడుతూ వేధిస్తుందన్నారు. నేహా కౌసర్ ని చిత్రహింసలకు గురిచేసరి వాళ్ల నానమ్మ దగ్గర వదిలేయడంతో విషయం తెలుసుకుని ఐద్వా ఆధ్వర్యంలో శ్రీదేవి షేక్ హుస్సేన్ ఇంటికి వెళ్లి




పరిశీలించగా సవతి తల్లి అయినా రిజ్వాన బేగం గత ఐదు సంవత్సరాల నుండి అమ్మాయిని హింసకు గురి చేస్తూ పాడైపోయిన అన్నం పెడుతూ రోజు గొంతు పట్టి నులుముతూ చెప్పులతో కొడుతూ వేధింపులకు పాల్పడిందని తెలిసిందన్నారు. ప్రతిరోజు అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లగొట్టి తెల్లారే వరకు బయటనే కూర్చోబెట్టేది అని స్థానికులు చెప్పారు విషయం తెలుసుకున్న ఐద్వా నాయకులు 5 టౌన్ ఎస్సైకి ఫిర్యాదు చేశారు. నాగారం ఏరియా 11వ డివిజన్ పూర్తిగా హింసాత్మకంగా మారిందన్నారు. ఇక్కడ గంజాయి అమ్మే వాళ్లు మర్డర్లు చేసేవాళ్ళు, ఇతర జిల్లాల నుంచి చిన్న పిల్లల్ని తీసుకొచ్చి భిక్షాటన చేయించే వాళ్ళకు అడ్డాగా మారిందని పేర్కొన్నారు. అమాయకపు ప్రజలను ఓనర్లకు సంబంధం లేకుండానే కిరాయిలు వసూలు చేస్తూ మంచినీటి పేరుమీద డబ్బులు వసూలు చేస్తూ మేము కమిటీ సభ్యులం అని చెబుతూ ఒక రకమైన హింసకు గురి గురిచేస్తూ మేమేం చేసిన మమ్మల్ని అడిగే వారే లేదు అనే విధంగా అరాచకాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీటిని అరికట్టే విధంగా ఐదో టౌన్ ఎస్ఐ ఈ ప్రాంతంపై స్పెషల్ ఫోకస్ పెట్టి ఇలాంటివి ఏవి జరగకుండా అరాచకాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని వారికి సరైన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే హింసకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగరనాయకురాలు శ్రీదేవి, స్థానికులు శోభ,దూలన్,హైమది,ఫరానా, పోతుజ,తదితరులు పాల్గొన్నారు.

## పూలె ఆశయాలను సాధిద్దాం

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...**

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 11 :**
మహాత్మా జ్యోతిబా పూలె ఆశయాలను సాధిద్దామని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. మహాత్మా జ్యోతి రావ్ పూలె 199వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో వినాయక నగర్ విగ్రహాల పార్క్ వద్ద నిర్వహించిన జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు మహాత్మా జ్యోతి రావ్ పూలె సామజిక తత్త్వవేతగా బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయులని కొనియాడారు. మన దేశ ప్రగతి యాత్రలో వెనుకబడటానికి వందల సంవత్సరాలు విదేశీయుల పాలనలో మ్రగ్గడానికి,మూఢచారాలు ప్రబలడానికి కారణం ప్రజల్లో జ్ఞానం లేకపోవడమే అని గుర్తించి సమాజంలో అందరిని విద్యావంతులను చేయాలనేవిషయంలో శ్రద్ద వహించకపోవడమేనన్న విషయాన్నీ గ్రహించి



జ్యోతిరావు పులే తన జీవితం అంత బడుగు బలహీన వర్గాల ప్రజలకు,స్త్రీలకు విద్య నేర్పించడానికి జీవితాన్ని అంకితం చేసారన్నారు. సత్యశోదక్ సమాజ్ ద్వారా సమాజంలో అసమానతలను,మూఢ నమ్మకాలను రూపుమాపడానికి పోరాటం చేసారన్నారు. జ్ఞానం లేకుంటే గౌరవం లభించదని, శిక్షణ లేకుంటే సమాజంలో సంస్కరణ సాధ్యం కాదని,స్త్రీలను విద్య అందించాలన్న సంకల్పంతో మొదట తన భార్య సావిత్రిభాయ్ విద్య నేర్పిచి పూణే నగరంలో మొదటిసారిగా బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభించారని తెలియజేసారు. ఆంగ్లప్రభుత్వం పేదప్రజల కొరకు ఉచితంగా చదువు చెప్పించే ఏర్పాటు చేసి,వారి అజ్ఞానాన్ని,పేదరికాన్ని తొలగించి,ప్రజలను సుఖంగా,సంతృప్తిగా జీవించేటట్లు చూసుకోవడం ప్రభుత్వం యొక్క బాధ్యత అని,బ్రిటిష్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపిన మహనీయులు పులే అని అన్నారు. పులే దంపతులు ఇరువురు సమాజంలో అసమానతలు,కుల వ్యవస్థ నిర్ములనకు పోరాటం చేస్తూ బాల్య వివాహలకు వ్యతిరేకంగా,వితంతు గర్భిణీలకు అండగా,అనాధ పిల్లలను అక్కున చేర్చుకున్న మహనీయులు పులే దంపతులు అన్నారు. సమాజం ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న,సంఘ బహిష్కరణలు చేసిన చివరికి తండ్రి కూడా ఇంటినుండి వెళ్లగొట్టిన వనవాసనికి రాముని వెంట సీతలా పులే వెంట సావిత్రి భాయ్ భర్త లక్షసాధనలో తోడుండి ఈ దేశానికి మొదటి పంతులమ్మ అయ్యి వారి జీవితాన్ని పూర్తిగా బడుగు,బలహీన వర్గాల అభివృద్ధి,సమానత్వం కోసం పాటుపడటం జరిగిందన్నారు. నేటి సమాజం,యువత వారి ఆశయ సాధనలో నడవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు,కార్పొరేటర్లు,మండల అధ్యక్షులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## "బార్"ప్రధాన కార్యదర్శిగా మానిక్ రాజు ఎన్నిక

**కబురు న్యూస్ని,జామాబాద్ లీగల్,ఏప్రిల్ 11 :**
నిజామాబాద్ బార్ అసోసియేషన్ 2025-26 వార్షిక ఎన్నికలు శుక్రవారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. ఉదయం పదిగంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం నాలుగన్నరకు ముగిసింది. మొత్తం392 ఓట్లలో 322 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లను లెక్కించ ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన దిలీప్,రేంజర్ల సురేష్ లకు సరి సమానంగా 157 వచ్చాయి. ఇద్దరిని ఉపాధ్యక్షులుగా ఎన్నికల అధికారులు జె.వెంకటేశ్వర్,ఆర్. ఎస్.ఎల్ గౌడ్,ఎర్రం విగ్నేష్,బిట్ల రవి, మధుసూదన్ గౌడ్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శి పోటీలో నిలిచిన బట్టు మానిక్ రాజు కు 165 సాధించి 65 ఓట్ల మెజారిటీ సాధించి భాస్కర్ రెడ్డి ని ఓడించారు. భాస్కర్ రెడ్డికి కేవలం100 ఓట్లు మాత్రమే వచ్చాయి. బాలరాజ్ నాయక్ 50 ఓట్లకే పరిమితయ్యారు. సంయుక్త కార్యదర్శి గా ఝాన్సీరాణి 179 ఓట్లు రాగా సత్యనారాయణ గౌడ్ కు 140 మాత్రమే పొలయ్యాయి. 39 ఓట్ల ఆధిక్యంతో గౌడ్ ను ఆమె మట్టికరిపించారు. ఉపాధ్యక్షునికి పోలైన ఓట్లను లెక్కించగా సురేష్, దిలీప్ మధ్య అటూఇటూగా గెలుపు, ఓటమి దోభుచులాడి ఇద్దరికి 157



సరిసమానంగా రావడంతో ఉత్కంఠ భరితంగా నిలిచాయి...
- బార్ పూర్తిస్థాయి కార్యవర్గం.
- నిజామాబాద్ బార్ అసోసియేషన్ పూర్తిస్థాయిలో ఆఫీస్ బేరర్స్,కార్యవర్గం ఏర్పడినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అధ్యక్షుడు గా మామిల్ల సాయరెడ్డి ఎన్నికయ్యారని వివరించారు. కోశాధికారిగా నారాయణ దాసు,సాంస్కృతిక, క్రీడా కార్యదర్శిగా మంజిత్ సింగ్,లైబ్రరీ కార్యదర్శిగా శ్రీమాన్, మహిళ ప్రతినిధిగా రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విడితమేనని వారు వెల్లడించారు. కార్యవర్గ సభ్యులుగా మద్దెపల్లి శంకర్,భిక్షపతి,ఆయుబ్,మోబిన్, అరేటి నారాయణ, సయ్యద్ ఇంతియాజ్, సుజిత్ కుమార్, ప్రవీణ,వెంకటేష్, అఖిల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అన్నారు. నూతన బార్ కార్యవర్గానికి న్యాయవాదులు పూలమాలలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు

# ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు

**- సాంఘిక బహిష్కరణలు విధించే వీడీసీలపై కఠిన చర్యలు..కలెక్టర్ స్పష్టీకరణ...**









**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,ఏప్రిల్ 11 :**
మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు.జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో న్యూ అంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథిగా విచ్చేయగా,రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి,జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ,సామాజిక రుగ్మతలను,దురాచారాలను పారద్రోలేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు.అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలో అణగారిన వర్గాలకు తగిన గౌరవం దక్కాలంటే విద్యతోనే సాధ్యం అని గుర్తించిన పూలే,విద్యను నేర్చుకోవాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారన్నారు. ప్రత్యేకించి బాలికల విద్య కోసం పాఠశాలలు నెలకొల్పి ప్రత్యేక కృషి కొనసాగించారని గుర్తు చేశారు.అన్ని వర్గాలకు సమానత్వం ఉండాలన్నదే పూలే అభిమతం అని, ఆ దిశగా తుది వరకు తన కృషిని కొనసాగించారని కొనియాడారు.ఆయన చూపిన బాటలో పయనిస్తూ,పూలే ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ముఖ్యంగా విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్ర గురించి,వారు సమాజ అసమానతలకు వ్యతిరేకంగా జరిపిన పోరాటాల గురించి తెలుసుకోవాలని సూచించారు.మహనీయులను స్మరించుకుంటూ వారి ద్వారా ప్రజలు స్పూర్తి పొందాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం అధికారకంగా జయంతి ఉత్సవాలు నిర్వహిస్తోందని అన్నారు.పరస్పర సమన్వయంతో మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటూ జిల్లాను ఆదర్శంగా నిలుపుదామని ఆయా సంఘాల ప్రతినిధులకు సూచించారు. బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఆయా వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తరపున ఎల్లవేళలా చొరవ చూపుతామని, ఎలాంటి సమస్య ఉన్న తనను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు.

**సాంఘిక బహిష్కరణలు విధిస్తే కఠిన చర్యలు**

కాగా,జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట సాంఘిక బహిష్కరణలు విధిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి వీ.డీ.సీలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పూలే జయంతి వేదిక ద్వారా స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధికి వీ.డీ.సీలు కృషి కొనసాగిస్తే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదని, అందుకు భిన్నంగా వీడీసీ ముసుగులో చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు పూనుకుంటే ఎంతమాత్రం ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు. సాంఘిక బహిష్కరణ ఫిర్యాదులపై పోలీస్ కమిషనర్ తో ఒకటి రెండు రోజుల్లోనే చర్చించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టేలా చూస్తామని అన్నారు. సాంఘిక బహిష్కరణలు వంటి రుగ్మతలకు వ్యతిరేకంగా వివిధ సంఘాలు కూడా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమాజంలో ఇంకనూ అక్కడక్కడ నెలకొని ఉన్న వివక్షతను రూపుమాపేందుకు పూలే స్పూర్తితో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఇదిలాఉండగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి అందించే ఈ.డబ్ల్యూ.సీ పత్రాలను సమగ్ర విచారణ జరిపి అర్హత కలిగిన వారికి మాత్రమే మంజూరు చేసేలా ఆర్డీఓలు, తహసీల్దార్ లకు ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు. బీ.సీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణం విషయంలో నెలకొని ఉన్న న్యాయపరమైన అడ్డంకులు తొలిగేలా ప్రత్యేక చొరవ చూపుతామని హామీ ఇచ్చారు.రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి,ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ లు మాట్లాడుతూ,పూలే కృషిని కొనియాడారు. దాదాపు 200 సంవత్సరాల క్రితం అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలో నెలకొని ఉన్న రుగ్మతలను పారద్రోలేందుకు జ్యోతిబాపూలే చేసిన కృషి అనన్య సామాన్యమైనదని అన్నారు.అనేక అవరోధాలు,అవమానాలు ఎదురైనప్పటికీ ఏమాత్రం వెరువకుండా పూలే నాటి సాంఘిక దురాచారాలను తుదముట్టించేందుకు ఎంతగానో శ్రమించారని గుర్తు చేశారు.ముఖ్యంగా అణగారిన వర్గాలు,శూద్రులు సమానత్వం సాధించాలంటే విద్య ఎంతో అవసరమని గుర్తించి వారికి విద్య అందేలా తీవ్రంగా కృషి చేశారని,మహిళల విద్య కోసం ప్రత్యేకంగా మొట్టమొదటి పాఠశాలను స్థాపింపజేశారని అన్నారు.మహాత్మ జ్యోతిబాపూలే ఆలోచనలకు ప్రభావితమైన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పూలేను తన గురువుగా ప్రకటించారని తెలిపారు. పూలే ఆశయాలు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం బడుగు,బలహీన వర్గాల వారి సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని,57 వేల ఉద్యోగ నియామకాలు జరిపిందని,హాస్టల్ విద్యార్థులకు గణనీయంగా డైట్,కాస్మొటిక్ ఛార్జీలు పెంచిందని,యువత స్వయం ఉపాధి కోసం పెద్ద ఎత్తున రాయితీతో కూడిన రుణాలు అందించి వారు ఎంపిక చేసుకునే యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించేలా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తోందని వివరించారు.పూలే వంటి మహనీయులు చూపిన బాటలో పయనిస్తూ వారి ఆశయాల సాధన కోసం కృషి చేసినప్పుడే మన జీవితానికి కూడా సార్థకత చేకూరుతుందన్నారు.కాగా,ఈ కార్యక్రమానికి ముందు వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద గల మహాత్మా పూలే విగ్రహానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ,కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,బీసీ సంఘాల ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి,జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారిణి స్రవంతి,సహాయ అధికారి నర్సయ్య,వివిధ సంఘాల ప్రతినిధులు గైని గంగారాం,బుస్స ఆంజనేయులు, నరాల సుధాకర్,మాడవేడి వినోద్ కుమార్,రవీందర్,బంగారు సాయిలు, రాజేశ్వర్, బుస్సాపూర్ శంకర్, పెద్ది రాములు,షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ శోభాయాత్రను శాంతియుతంగా నిర్వహించాలి

**- శోటభయాత్రకు 1300 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు...**
**- పోలీస్ కమిషనర్ సాయి చైతన్య...**



**కబురు న్యూస్,నిజామాబాద్ ఏప్రిల్ 11 :**
హనుమాన్ శోభాయాత్రను శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు.ఇందుకోసం 1300 వందల మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నిజామాబాద్ కమీషనరేటు పరిధిలోని నిజామాబాద్,ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిదిలోని ఈ నెల 12న నిర్వహించే హనుమాన్ జయంతి,శోభాయాత్ర,అన్నదాన కార్యక్రమాలు శాంతియుతంగా నిర్వహించాలని అన్నారు.ఇందుకోసం నిజామాబాద్ ఖమ్మం,రాజన్న సిరిసిల్ల,భూపాలపల్లి,ములుగు,మహబూబాబాద్ జిల్లాల నుండి పోలీస్ సిబ్బంది,టీఎస్ఎస్పీ బెటాలియన్ పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వాహణ కోసం దాదాపు 1300 మందితో ఏర్పాట్లు చేశామన్నారు.నిజామాబాద్ డివిజన్ పరిధిలలో హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శోభాయాత్ర ప్రారంభం నుండి చివరి వరకు దారి పొడువున "సి.సి కెమెరాలు,డ్రోన్ కెమెరాలు ఏర్పాట్లు,బైనాక్యులేర్లతో పర్యవేక్షణ,పాత నేరస్థులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా ప్రతీ ఒక్కరు అన్ని రకాల జాగ్రత్తలు వహించాలని,శోభాయాత్ర సందర్భంగా అవసరమైనజాగ్రత్తలు వహించాలని,శోభాయాత్ర ప్రారంభం నుండి ప్రశాంతంగా సాగేందుకు యాత్ర నిర్వాహకులు,భక్తులు యాత్రలో పాల్గొనే ప్రజలు నిబంధనల ప్రకారం నడుచుకుంటు పోలీసులకు సహకరించాలని కోరారు.శనివారం ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు.హైదరాబాద్,ఆదిలాబాద్,వరంగల్ వెల్లు బస్సులు ఆర్టీసీ బస్ స్టాండ్,జడ్పీ రోడ్,నిర్మల హృదయ స్కూల్ ముందు నుండి అంబెద్కర్ కాలనీ, దుబ్బ రోడ్, గిరిరాజ్ కాలనీ నుండి బైపాస్ రోడ్డు చేరుకోవాలి.బోధన్ నుండి వచ్చి పోయే వాహనాలు అర్సపల్లి రైల్వే గేట్ నుండి కొత్త కలక్టరేట్,కాంటేశ్వర్ బై పాస్,కాంటేశ్వర్ టెంపుల్ "టి" జంక్షన్,ఎన్టీఆర్ చౌరాస్తా,ఆర్టీసీ బస్ స్టాండ్ చేరుకోవాలి.బాన్స్ వాడ నుండి వచ్చి పోయే వాహనాలు వర్ని చౌరాస్తా నుండి పులాంగ్ సర్కిల్, కోర్ట్ సర్కిల్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్ ఆర్టీసీ బస్సు స్టాండ్ చేరుకోవాలి. నిజామాబాద్ డివిజన్ మొత్తం సిబ్బంది పోలీస్ కమీషనర్, అదనపు పోలీస్ కమీషనర్లు,ఎ.సి.పిలు, సి.ఐ లు, ఎస్.ఐ లు. ఎ.ఎస్.ఐ లు,హెడ్ కానిస్టేబుల్స్,కానిస్టేబుల్స్,మహిళా కానిస్టేబుల్స్,స్పెషల్ పార్టీలు / ఇతర సిబ్బంది దాదాపు 1300 మంది బందోబస్తులో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

# వీర హనుమాన్ విజయ యాత్ర ను శాంతియుతంగా జరుపుకోవాలి...

**- హనుమాన్ జయంతి ర్యాలీ ఆర్గనైజర్లతో సమన్వయ సమావేశంలో సీపీ సాయి చైతన్య..**

**కబురు న్యూస్,బోధన్,ఏప్రిల్ 11..**
వీర హనుమాన్ విజయయాత్ర ను శాంతియుతంగా జరుపుకోవాలని నిజామాబాద్ సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. బోధన్ పట్టణంలోని శ్రీ మారుతి మందిరం నుండి అంబేద్కర్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, శ్రీ మారుతి మందిరం వరకు జరగనున్న హనుమాన్ జయంతి ర్యాలీ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని అప్పా ఫంక్షన్ హాల్ లో నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య హనుమాన్ ర్యాలీ నిర్వహకులతో,





వివిధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా పాటించవలసిన నియమ నిబంధనలు వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో ఉత్సవం ఘనంగా జరుపుకోవాలన్నారు. ర్యాలీ ఆధ్యాత్మికంగా నిర్వహించుకోవాలని అదే సమయంలో ఇతరులకు, సామాన్యులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. డ్రోన్ల ను నిషేధించటం జరిగిందన్నారు. ఈ సమావేశంలో హనుమాన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు. అనంతరం హనుమాన్ ర్యాలీ జరిగే రూట్ ను పర్యవేక్షించారు. ఈ సమావేశంలో బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట్ నారాయణ, రూరల్ సీఐ విజయ్ బాబు, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, రుద్రూర్ సీఐ కృష్ణ , బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి , ఏడపల్లి ఎస్ఐ వంశీ, రెంజల్ ఎస్ఐ చంద్ర మోహన్, వర్ని ఎస్ఐ మహేష్, రుద్రూర్ ఎస్ఐ సాయన్న, కోటగిరి ఎస్ ఐ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

# బహుజనుల ఆత్మబంధువు మహాత్మ జ్యోతిరావు పూలే

**కబురు న్యూస్,నిజామాబాద్ లీగల్,ఏప్రిల్ 11 :**
అనాగారినవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడిన వ్యక్తి బహుజనులకు ఆత్మబంధువు మహాత్మా జ్యోతిరావు పూలే అని బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ అన్నారు. శుక్రవారం రోజున బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మా జోతిబా పులే జయంతి కార్యక్రమాన్ని జిల్లా కోర్టు అవరణంలోని బార్ అసోసియేషన్ హాల్లో ఘనంగా నిర్వహించరు అధ్యక్షులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షులు మాట్లాడుతూ,ఫూలే గారు అనేకమైనటువంటి




సంస్కరణను తీసుకువచ్చి మనుషుల్లో సమానత్వాన్ని పెంపొందించాలని సత్యశోధకు సంస్థ ద్వారా అనేక విద్యాలయాలు ఏర్పాటు చేసి బడుగు బలహీన వర్గాలకు విద్యను అందించినటువంటి మహనీయుడు పూలే గారు అని ప్రతి ఒక్కరు




ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆలోచన విధానంతో ముందుకు వెళ్లాలని నేను కాదు నా సమాజం అనే ఆలోచన తోటి నడవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి న్యాయవాదులు వసంత్ రావు ఆర్ రాజలింగం ఏం గోవర్ధన్ పేదంరాజు కవితా రెడ్డి అంజలి లిల్లి కిరణ్ కుమార్ గౌడ్ విఘ్నేష్ వెంకటేష్ విశ్వాక్ సేవ్ తదితరులు పాల్గొన్నారు.

# పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలి

**- బిసిటియు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్...**

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 11 :**
మహాత్మా జ్యోతిబా పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని బిసిటియు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.మహాత్మా జ్యోతి భా పూలే 199 వ జయంతి సందర్భంగా బిసి ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిసి ఉపాధ్యాయ జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ




జ్యోతిభా పూలే ప్రముఖ సంఘ సంస్కర్త, బహుజనుల వెనుకబాటుకు విద్య లేకపోవడమే అని గ్రహించి 180 సంవత్సరాల క్రితమే మొట్టమొదట అనేక పాఠశాలలు స్థాపించి విద్య ను అందించిన ఘనత జ్యోతిభా పూలే దంపతులకు దక్కుతుందని అన్నారు.ఆ దంపతులకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డు ను ప్రకటించాలన్నారు.ఈ కార్యక్రమంలో బిసిటియు జిల్లా అసోసియేటడ్ అధ్యక్షులు ఎ మోహన్, కార్యనిర్వాహక అధ్యక్షులు కొట్టాల రామకృష్ణ, ఉపాధ్యక్షులు రమేష్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కబురు
KABURU TELUGU DAILY
శనివారం ఏప్రిల్ 12 2025

# కత్తితో దాడి చేసిన నిందితునికి పది వేల జరిమానా....

కబురు న్యూస్,బోధన్,ఏప్రిల్ 11..
కల్లుబట్టిలో కత్తితో దాడి చేసిన ముద్దాయికి పదివేల రూపాయలు జరిమానాతో పాటు ఐదు వేల రూపాయాల నష్టపరిహారం బాధితురాలకు కట్టాలని బోధన్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ దేవాన్ అజయ్ కుమార్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. బోధన్ కోర్టు లైజనింగ్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన ద్వారంగుల లక్ష్మి ఫిర్యాదు ప్రకారం తన భర్త గంగాధర్ మేస్త్రిపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తు 08-06-2024 మధ్యాహ్నం 12 గంటల సమయంలో బోధన్ పాతబస్టాండ్ వద్ద ఉన్న ఒకటవ నెంబర్ కల్లుబట్టికి పోయే క్రమంలో ఒక వ్యక్తి నా భర్త భుజానికి తాగడం వలన క్రింద పడిపోయాడు. అంతేకాకుండా అదే వ్యక్తి భర్త మెడపై కత్తితో దాడి చేయడం వలన గాయమైంది. ఇట్టి విషయం మా గల్లీ లో ఉన్న వ్యక్తుల ద్వారా నాకు తెలియడంతో భర్త ను ఆసుపత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. అట్టి వ్యక్తి గురు గోవింద్ నగర్ కు చెందిన జీవన్ సింగ్ అని తెలిసి బోధన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్.హెచ్.ఓ. వీరయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి చార్జిషీటు కోర్టు నందు ఫైల్ చేయడం జరిగింది. పోలీసుల తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్.పి.సమ్మయ్య వాదించారు. సాక్షులను పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ దేవాన్ అజయ్ కుమార్ ముద్దాయికి పదివేల రూపాయలు జరిమానా,ఒకవేళ కట్టలేని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు జీవితం అనుభవించాల్సి ఉంటుందని, అదేవిధంగా బాధితురాలకు నష్టపరిహారంగా ఐదు వేల రూపాయాలు చెల్లించాలని తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ప్రస్తుత, ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ.వెంకటనారాయణ, లైసెనింగ్ అధికారి జి.ముత్తయ్య, కోర్టు పోలీస్ అధికారి గణేష్ నాయక్ లు సహకరించారు.

# డ్రైయినేజీ సమస్య పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి



– అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 11 :
నగరంలోని డివిజన్లలో డ్రైయినేజీ సమస్య పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిత్యం శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు.నాగారం 9వ డివిజన్లో ధన్ పాల్,మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ తో కలిసి పర్యటించారు.నగరంలో డ్రైయినేజీ సమస్య కీలకంగా మారిందని,డ్రైయినేజీల్లో చెత్త,నీరు నిల్వ ఉండటం చూసి మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్,సిబ్బందికి పలు సూచనలు చేశారు. అవసరం ఉన్న చోట డ్రైయినేజీలు,సీసీ రోడ్లు నిర్మించాలని అలాగే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారువేసవి కాలంలో ప్రజలకు మంచినీటి కోరత లేకుండా చూసుకోవాలన్నారు. అవసరం ఉన్న చోట వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని,బోర్స్ వేయాలని సూచించారు. ధన్ పాల్ లక్ష్మిభాయ్,విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా డివిజన్ ప్రజలకు మంచినీటి సౌకర్యం కోసం తన సొంత నిధులతో వేయించిన మంచి నీటి బోర్స్ ను మున్సిపల్ అధికారులను స్వాధీనం చేశారు. వాటికి మీటర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. డివిజన్ లో ఎలక్ట్రికల్ స్తంభాలు,వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లో సమస్యలను పరిశీలించి పరిష్కరించేలా అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ మురళి మోహన్ రెడ్డి,అడిషనల్ మున్సిపల్ కమిషనర్ జయకుమార్,ఏఈ భూమేష్,బీజేపీ మండల అధ్యక్షులు నాగరాజు,స్థానిక మాజీ కార్పొరేషన్ సాయి వర్ధన్,కిరణ్,సుందర్ రాథోడ్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లకు వాహనాలు ఇస్తే ఇక జైలుకే



– ట్రాఫిక్ ఏసీపి టి.నారాయణ...

కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,ఏప్రిల్ 11 :
మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులకు జైలు శిక్షతో పాటు జరిమానా తప్పదని ట్రాఫిక్ ఏసీపి టి.నారాయణ అన్నారు. నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్లకు,వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలో వాహనాలు నడుపుతున్న ఎనిమిది మంది మైనర్లను పట్టుకున్నట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి జరిమానా విధించినట్లు తెలిపారు. ఇకముందు నుండి ఎవరైనా మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై కేసు నమోదు చేసి సంబంధిత న్యాయస్థానంలో హాజరు పరిచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూ.25వేల వరకు జరిమానా కూడా విధించబడుతుందన్నారు. న్యాయస్థానాలు వాహన యజమానికి 3 సంవత్సరాలు జైలు శిక్ష,12 నెలల పాటు అట్టి వాహనం యొక్క రిజిస్ట్రేషన్ రద్దు చేసే అవకాశం ఉందన్నారు. అంతేకాక మైనర్ కి 25 సంవత్సరాలు వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి వీలులేదన్నారు.

# బోధన్ ఠాణా ను పరిశీలించిన సీపీ సాయి చైతన్య...









కబురు న్యూస్,బోధన్,ఏప్రిల్ 11..
నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య శుక్రవారం బోధన్ పోలీస్ స్టేషన్ ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ మొత్తం కలియతిరిగి పోలీస్ స్టేషన్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. రిసిప్షన్ సెంటర్ పనితీరును , కంప్యూటర్ సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. 5%ూ% విధానం అమలు చేస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్ చూసి,రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలిపారు. ప్రధానంగా ఎక్కువ ప్రమాదాలు ద్విచక్ర వాహనాదారులకు జరుగుతున్నందున, తప్పనిసరి హెల్మేట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. గంజాయి నిర్మూలనకు అధికారులకు ఆదేశాలు జారీచేయడం జరిగిందని, ఎవరయిన గంజాయికి బానిసవుతే వారికి కౌన్సిలింగ్ చేయాలని తెలిపారు. దాని నిర్మూలనకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సైబర్ మోసగాండ్ల నుండి ప్రజలు మోసపోకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. గేమింగ్ యాప్ ల పట్ల ప్రజలు మోసపోకుండా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా బోధన్ ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట్ నారాయణ లు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన...









కబురు న్యూస్,బోధన్,ఏప్రిల్ 11..
బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ లో గల హనుమాన్ వ్యాయామశాల వద్ద హనుమాన్ విగ్రహం ప్రతిష్టాపన మహోత్సవ వేడుకలు కన్నుల పండువగా ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శక్కర్ నగర్ లో నూతన హనుమాన్ విగ్రహం ప్రతిష్టాపన కార్యక్రమంతో పాటు ఎంపీ నిధులు 5లక్షలు, విరాళాల సేకరణ నిధులు కలుపుకుని 22లక్షల రూపాయలతో నూతన వ్యాయామశాల భవనాన్ని నిర్మించారు. వేద పండితులు ఉదయ్ శర్మ మంత్రోచ్చారాణాల పూజలు, హెూమాలు చేసి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ దిగంబర్, ఆదినారాయణ, అర్జున్ రాందర్, శ్రీనివాస్, కనకరాజు, అడ్లూరి శ్రీనివాస్, కోటేశ్వర్ రావు, స్వామి, శ్రీనివాస్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# సీపీ సాయిచైతన్యను కలిసిన ఎంపీ అరవింద్





కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,ఏప్రిల్ 11 :
ఇటీవల నిజామాబాద్ నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించిన సాయి చైతన్యను ఎంపీ అరవింద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతలు,ఇతర గురించి చర్చించారు. ఎంపీతో పాటు అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ,భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి పాల్గొన్నారు.

# రక్తపింజర విష స్వభావాలను తెలిపేలా ప్రత్యేక మ్యాప్‌లు

– అభివృద్ధి చేసిన ఐఐఎస్‌సీ పరిశోధకులు

కబురు న్యూస్, ఢిల్లీ ,ఏప్రిల్ 11.
ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది ప్రాణాలను హరిస్తున్న ప్రమాదకర పాముల్లో రక్తపింజర ఒకటి. దాని విష స్వభావం అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండదు! ఈ నేపథ్యంలో– రక్తపింజర కాటుకు గురైనప్పుడు దాని ప్రభావశీలతను గుర్తించి, బాధితులకు సత్వరం మెరుగైన చికిత్స అందించేందుకు ఉపయోగపడేలా 'వీనమ్ మ్యాప్స్'ను బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) పరిశోధకులు తాజాగా అభివృద్ధి చేశారు. సాధారణంగా పాము విషం తీవ్రత.. అందులోని ఎంజైమ్‌ల గాఢతపై ఆధారపడి ఉంటుంది. అయితే ఆయా ప్రాంతాల్లో పాములకు ప్రత్యేకంగా దొరికే ఆహార పదార్థాలతోపాటు అక్కడి ఉష్ణోగ్రత, వర్షపాతం, తేమ వంటివి కూడా విషం తీవ్రతపై ప్రభావం చూపుతున్నట్లు ఐఐఎస్‌సీ పరిశోధకులు గుర్తించారు. వాటి ఆధారంగా.. ప్రాంతాలవారీగా రక్తపింజరల విషం ప్రత్యేక స్వభావాలను తెలియజేసే వీనమ్ మ్యాప్‌లను రూపొందించారు.

# బోధన్ లో ఆన్లైన్ బెట్టింగ్ నిర్వాహకుని అరెస్ట్...



కబురు న్యూస్,బోధన్,ఏప్రిల్ 11..
బోధన్ పట్టణంలో ఆన్ లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న బీటి నగర్ ప్రాంతానికి చెందిన షేక్ సయీద్ ను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. వివరాల ప్రకారం షేక్ సయీద్ అనే వ్యక్తి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు బీటి నగర్ లోని అతని ఇంటిలో సయీద్ ను అదుపులోకి తీసుకొని విచారించగా తనకు ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఆడించడానికి నిజామాబాద్ కు చెందిన ముజీబ్, సచిన్ ల ద్వారా బోధన్ లో ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడడానికి ఐడి క్రియేట్ చేసి అట్టి ఐడి ద్వారా బోధన్ లో కొంత మంది యువకులు, కాలేజీ పిల్లలను గుర్తించి వారికి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని మాయ మాటలు చెప్పి ఆన్ లైన్ లో డబ్బులు వసూలు చేసుకొని క్రికెట్ బెట్టింగ్ అడిచ్చేవాడన్నారు. అలా వచ్చిన డబ్బులను ముజీబ్ కి ఇచ్చేవాడని, అలా ఆడిపించినందుకు షేక్ సయీద్ కి ముజీబ్ ఇతరులు కలిసి కమిషన్ 5శాతం ఇచ్చేవారన్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న షేక్ సయీద్ ను శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని సీఐ పేర్కొన్నారు. అతని వద్ద నుండీ మొబైల్ ఫోన్, బ్యాంక్ స్టేట్‌మెంట్లు సీజ్ చేయటం జరిగిందన్నారు. ఎవరైనా ఆన్ లైన్ బెట్టింగ్ కి పాల్పడితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోబాడతాయని హెచ్చరించారు.

# ఎందరో మహానుభావులకు పూలే స్ఫూర్తి

కబురు న్యూస్,(మంచిర్యాల బ్యూరో) ఏప్రిల్ 11
మహాత్మ జ్యోతిరావు పూలే ఎందరో మహానుభావులకు స్ఫూర్తి అని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది డాక్టర్ రాజలింగు మోతె తెలిపారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జిల్లాలోని రామకృష్ణాపూర్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులు అర్పించారు. అనంతరం రాజలింగు మోతె మాట్లాడాతూ, దేశ పురోభివృద్ధికి ప్రతిబంధకాలు అయిన అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాలు, నిచ్చెనమెట్ల కులవ్యవస్థ రూపుమాపడానికి, అసమానతలు లేని సమాజాన్ని రెండు వందల సంవత్సరాల కిందట మహాత్మా జ్యోతిరావు పూలే ఆకాంక్షించారన్నారు. సామాజిక న్యాయం, విద్య, సమానత్వంకోసం చివరి దాకా పూలే పోరాడారని తెలిపారు. దేశంలో అసమానతలు లేని సమాజం వచ్చినప్పుడు, రాజకీయ ప్రాతినిధ్యం లేని కులాలు అందలమెక్కినప్పుడు, ఆయన పోరాటానికి సార్ధకత ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో చిన్నారులు శ్రీ తీర్థ, సాయి ధరమ్ తేజ్, హిమదీక్షిత్, శివ, కపిల్ లు పాల్గొన్నారు.

# అనగారినవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన మహానీయుడు జ్యోతిబా పూలే...



## - టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్...

**కబురు న్యూస్,శంకరపట్నం ఏప్రిల్ 11**
అన గారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన మహనీయుడు, జ్యోతిబాపూలే టిపిసిసి మెంబర్ మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె స్వరూప ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. సంఘసంస్కర్త సమకాలిక సామాజిక రుగ్మతులను కుల వివక్ష భావజాలానికి వ్యతిరేకంగా పోరాటం చేసి బాలికల విద్య శ్రీ హక్కులు వితంతు పునర్వివాహానికి కృషిచేసిన మహనీయుడని బలహీన వర్గాల న్యాయం కోసం సాధికారిక కోసం పరితపించిన సాంఘిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె స్వరూప మాట్లాడుతూ మహిళలకు బడుగు బలహీన వర్గాలకు అగ్రవర్ణ పేదలకు చదువు నందించిన గొప్ప మహనీయుడని జ్యోతిబాపూలే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, డిప్యూటీ తాసిల్దార్ పార్థసారథి, ఆర్ ఐ బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కవ్వ పద్మ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు చింతిరెడ్డి పద్మ, ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గుల్ల రాజు, కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి పవన్, మానకొండూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మహమ్మద్ షారుక్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, గొడిశాల ప్రవీణ్, సంపత్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

# జిఎం కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**కబురు న్యూస్, ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 11:**
మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా ఆర్జి 1 ఏరియా జీఎం కార్యలయం మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జి 1 ఏరియా జి.ఎం డి.లలిత్ కుమార్ హాజరు



అయి మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లు అర్పించారు. జిఎం మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడెట్కన జ్యోతీరావ్ గోవిందరావ్ ఫులే మహారాష్ట్ర లోని సతారా జిల్లాలోని మాలి కులానికి చెందిన కుటుంబంలో 1827 ఏప్రిల్ 11న జన్మించాడని, వెనుకబడిన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై పూలే చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయాల సాధనకై బీసీ సోదరులు ఐఖ్యంగా ఉండాలని తెలిపారు. సింగరేణి అద్వర్యంలో ఏరియాలోని అన్ని గనులు మరియు డిపార్ట్ మెంట్ లలో బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారు మహాత్మా జ్యోతీరావు పూలె జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు, పెరుమాళ్ళ శ్రీనివాస్ బిసి లైజన్ అధికారి, గుర్తింపు యునియన్ నాయకులు రంగు శ్రీనివాస్, యస్ఓటు జిఎం గోపాల్ సింగ్, అధికారుల సంఘం వర వరప్రసాద్, మల్లేష్, అధికారులు వెంకటేశ్వర్ రావు, ఆంజనేయ ప్రసాద్, కుమార స్వామి, ధనలక్ష్మి బాయి, మోహన్ రావు, జితేందర్ సింగ్, వీరా రెడ్డి, సాంబ శివరావు, బీమా, సీనియర్ పిఓ హనుమంత రావు, పిఓఏ వూట్ల దేవాచారి, ఇతర అధికారులు ఉన్నారు.

# కల్వల లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు...

## - 200 లీటర్ల బెల్లం పానకం,2 లీటర్ల నాటు సారా పట్టివేత...
## - వ్యక్తిపై కేసు నమోదు... చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులు...

**కబురు న్యూస్, శంకరపట్నం ఏప్రిల్ 11**
నిషేధిత నాటుసార తయారు చేస్తున్నట్లు పూర్తి సమాచారం మేరకు కల్వలలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్



పోలీసులు మాట్లాడారు . కరీంనగర్ ఎక్సైజ్ సూపర్ ఇండెంట్ పి శ్రీనివాసరావు ఆదేశం మేరకు కే నాగేశ్వరరావు టాస్కోర్స్ సిఐ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం కల్వల గ్రామంలో నిషేధిత నాటు సారా తయారు చేస్తున్నట్లు టార్ స్కోర్స్ పోలీసులు పూర్తి సమాచారాన్ని సేకరించి, శుక్రవారం టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా కల్వల శివారులో వ్యవసాయ పొలాలలో శివరాత్రి మల్లయ్య అనే వ్యక్తి నాటుసార తయారు చేస్తున్నాడని తమ తనిఖీల్లో వెల్లడైందని, శివరాత్రి మల్లయ్య పై కేసు నమోదు చేసి,2 లీటర్ల నాటు సారా, 200 లీటర్ల నాటు సారాకు వినియోగించే బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీస్ బృందం తదితరులు పాల్గొన్నారు.

# పూలే మార్గం అందరికీ అనుసరణీయం

## - యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్

**మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జమ్మికుంట మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబీ పూలే సేవలను కొనియాడారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్త్రీల అభ్యున్నతికి, స్త్రీ విద్యకు మహనీయుడు పూలే కృషిచేశారని తెలిపారు. తొలి బాలికల పాఠశాలను ప్రారంభించిన విద్యావేత్త పూలే అని అభివర్ణించారు. సమ సమాజ స్థాపనే జ్యోతిరావు పూలే లక్ష్యమని చెప్పారు.**

**కబురు న్యూస్,జమ్మికుంట ఏప్రిల్ 11**

మహాత్మా జ్యోతిరావు పూలే త్యాగాలను, సమాజానికి



చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని అన్నారు. ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నామని చెప్పారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. సమసమాజ నిర్మాణంలో జ్యోతిరావు పూలే కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే మనం అర్పించే ఘన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోబీ యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్య, తెలంగాణ ఉద్యమకారులు అన్నం ప్రవీణ్, ఫిషరీస్ విభాగం రాష్ట్ర కార్యదర్శి పింగిలి రాకేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాతకాల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శి యేబుషి అజయ్, దొడ్డ నవీన్, పాతకాల ప్రవీణ్, రాజ్ కుమార్, పచ్చిమట్ల భాను, జావిద్, అస్రఫ్, సతీష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆన్ వీల్స్ అమలుపై సన్నాహక సమావేశం...

**కబురు న్యూస్,,శంకరపట్నం ఏప్రిల్ 11**
మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ పల్లి సత్యనారాయణ శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే అన్ వీల్స్ వాహనం నిర్వహణపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈనెలలో అంబేద్కర్ జయంతి న ప్రారంభించనున్న ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం అమలుపై క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూరు నియోజకవర్గం లోని 6 మండలాల మండల శాఖ అధికారులైన, ఎంపీడీవోలు, తహసీల్దార్లతోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల చెంతకే వెళ్లి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నఉద్దేశంతో చేపట్టిన ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు



తోడ్పాటునందించాలని కోరారు. గ్రామ సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయానికి ప్రత్యేకమైన యాప్ ను రూపొందిచామని, ఈ యాప్ ద్వారా ప్రజల నుంచి వచ్చే విన్నపాలను పరిష్కరించేందుకు రోజుకు 3 గ్రామాలకు ప్రత్యకంగా తయారు చేయించిన వాహనంలో అధికారులతో కలిసి వెళ్లడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాలకు వెళ్లినప్పుడు యాప్ ద్వారా తెలియజేసిన సమస్యల గురించి తెలుసుకొని అప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలన్నదే ఈ ఎమ్మెల్యే ఆన్ వీల్స్ వాహన, కార్యక్రమం ఉద్దేశమన్నారు. మంచి ఉద్దేశంతో చేపట్టే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని, సమస్యల పరిష్కరించేందుకు పాటుపడాలని, ఎమ్మెల్యే కవ్వంపల్లి సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇంజినీర్లు రవి ప్రకాశ్, మంజులా భార్గవి, తహశీల్దార్లు కె.వరలక్ష్మి, బత్తుల భాస్కర్, విజయ్ కుమార్, ఎంపీడీవోలు విజయ్ కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, వై.శశికళ, డిప్యూటీ తహసీల్దార్లు సమ్మయ్య, నర్సింహచారి, గోపాల్, సత్యనారాయణ, ఏఈలు సురేందర్ రెడ్డి, స్నేహజ్యోతి, వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, సంతోష్ తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఆర్జి 1 ఏరియాలో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించాలి

## - ఆర్జి 1 ఏరియా జీఎం డి.లలిత్ కుమార్

**కబురు న్యూస్, గోదావరిఖని ఏప్రిల్ 11:**
భారత రత్న బాబా సాహెబ్ డాక్టర్. బి.ఆర్.అంబేడ్కర్ 134వ జన్మదినం పురస్కరించు కొని ఆర్జి 1 ఏరియా జీఎం కార్యాలయం వద్ద నిర్వహించు జయంతి వేడుకల ఏర్పాట్లకు సంబందించి ఆర్జి 1 ఏరియా జియం డి.లలిత్ కుమార్ అధికారులు, ఎస్.సి, ఎస్.టి వెల్ఫేర్ అసోసియేషన్



సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ భారత రత్న బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జన్మదినం పురస్కరించు ఆర్జి 1 ఎస్.సి, ఎస్.టి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సమన్వయంతో నిర్వహించు అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జీయం కార్యలయం దగ్గర అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని జీఎం తెలిపారు. ఇందుకు సంబందించి అంబేడ్కర్ విగ్రహానికి పూలతో, డెకరేషన్, లైటింగ్, షామియానాలు, త్రాగు నీరు, మైక్ సెట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంటేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని జీఎం తెలిపారు. అంబేడ్కర్ జయంతి వేడుకలను అభ్యుదయ కళా సంఘాలు, స్థానిక ప్రజలు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని విజయవతం చేయగలరని జీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జీయం గోపాల్ సింగ్, ఏరియా ఇంజనీర్ డి.వి. రావు, డిజీఎం ఏరియా వర్క్ షాప్ జితేందర్ సింగ్, డిజియం పర్సనల్ కిరణ్ బాబు, ఎస్.ఈ సివిల్ వర ప్రసాద్, సియం ఓ ఏ అధికారి కోలా మల్లేష్, బిసి లైజన్ పెరుమాళ్ళ శ్రీనివాస్, ఆంజనేయ ప్రసాద్, సీనియర్ పి.వో హనుమంతరావు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, ఎస్.సి లైజన్ ఆఫీసర్ డి.వెంకటేశ్వర్లు, ఎస్.సి&ఎస్.టి అసోసియేషన్ నాయకులు, ఈర్ల రాజేష్, జనగామ నర్సయ్య, పులి మోహన్, గంగారపు లింగమూర్తి, అరేపెల్లి రాంచదర్, ఆరెల్లి హరీష్, మేదరి కుమార్, తిరుపతి, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ తల్లి దర్శించి మొక్కు తీర్చుకున్న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

**కబురు న్యూస్, గోదావరిఖని ఏప్రిల్ 11:**
గోదావరిఖని మార్కండేయ కాలనీ లో గౌడ సంఘం ఆద్వర్యంలో నూతనంగా నిర్మించబడిన ఎల్లమ్మ గుడిని శుక్రవారం రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య సందర్శించి ఎల్లమ్మ తల్లిని దర్శించికొని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఇంత పెద్ద ఎల్లమ్మ గుడి నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు.
రామగుండం బీసీ యువజన సంఘం అధ్యక్షులు గున్నాల శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌడ సంఘం



నాయకులు ఆలయ కమిటి చైర్మన్ మేరుగు హనుమంతు గౌడ్, బాలసాని స్వామి గౌడ్, కోట రవి గౌడ్, సురేందర్ గౌడ్, సిరిశెట్టి తిరుపతి గౌడ్, బిందె నాగభూషణం, మాచిడి మహేందర్ గౌడ్, ఆంజనేయులు జనార్దన్ గౌడ్, మడ్డి శ్రీనివాస్, సంతోష్ గౌడ్, గౌడ్ విక్రం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జి.డి.కే ఓసి 5లో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ మహొత్సవం

**కబురు న్యూస్, గోదావరిఖని ఏప్రిల్ 11:**
మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జిడికే ఓసి 5లో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహా అవిష్కరణ మహొత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా



ఆర్.కృష్ణయ్య, ఎం.పి రాజ్యసభ, బీసీ ఉద్యమ నాయకులు, రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, అర్జీ 1 జిఎం డి.లలిత్ కుమార్, పంజాల శ్రీనివాస్ ఎస్.బిసిఈఎ ఫౌండర్, ఎస్.బిసిఈఎ ప్రసిడెంట్ వసంత్ కుమార్ హాజరు అయి వారి చేతుల మీదుగా మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ చేశారు. ముఖ్య అతిథులు ఆర్.కృష్ణయ్య ఎం.పి రాజ్య సభ మాట్లాడతూ జ్యోతీరావు గోవిందరావ్ పూలే సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడు వెనుకబడిన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై పూలే చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయాల సాధనకై బీసీ సోదరులమంతా ఎల్లవేలలా సిద్దంగా ఉంటామని ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళ శ్రీనివాస్ బిసి లైజన్ అధికారి, పిఒ చంద్ర శేఖర్, ఎస్.ఓ.ఎం అనిల్ గబాలే, డిటి చంద్ర మౌళి, మల్లేశం, జనరల్ సెక్రటరి వూట్ల దేవా చారి, ఎఐటియుసి బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, యునియన్ నాయకులు సదానందం, రాజి రెడ్డి, యాదగిరి సత్తయ్య, కయ్యుం, వడ్డేపల్లి శంకర్, మోహన్, పెంచాల తిరుపతి, గుర్రం ప్రభుదాస్, నాయకులు మహంకాళి స్వామి, పెద్దేల్లి ప్రకాష్, ఎసిపి మడత రమేష్, మెందె రమేష్, బిసి పిట్ సెక్రటరి చిందం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత యువజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమతా ర్యాలీ

## - మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, దళిత సంఘాల నాయకులు గుమ్మడి కుమారస్వామి

**కబురు న్యూస్, గోదావరిఖని ఏప్రిల్ 11:**
డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా రామగుండం నియోజకవర్గ దళిత యువజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమతా ర్యాలీ నిర్వహించనున్నామని మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, దళిత సంఘాల నాయకులు గుమ్మడి కుమారస్వామి తెలిపారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో




శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దళితుల ఐక్యతను చాటి చెప్పడానికి ఈనెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా గోదావరిఖని ఫైవ్ ఇంక్లైన్ చౌరస్తా నుండి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం చౌరస్తాలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, అంబేద్కర్ ఆలోచన విధానాలను నేటి తరానికి తెలియజెప్పేలా కార్యక్రమాలను రూపొందించడం జరిగిందన్నారు. రాజ్యాంగంలో రూపొందించిన రాజ్యాంగ ఫలాలను దళితులకు చేరవేసే క్రమంలో ప్రభుత్వాలు దాటవేత ధోరణిని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. దళితుల ఐక్యతను చాటుతూ ఈనెల 14 అంబేద్కర్ సమతా ర్యాలీలో మాల, మాదిగ, 59 ఉప కులాల ప్రజలు, పార్టీలకు అతీతంగా దళిత ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో దళిత యువజన ఐక్య వేదిక నాయకులు జెవి రాజు, పాముకుంట్ల భాస్కర్, రేణికుంట్ల ప్రీతం,చింటూ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి....

**- వైద్య అధికారి శ్రావణ్ కుమార్....**

**కబురు న్యూస్,శంకరపట్నం ఏప్రిల్ 11**
అంగన్వాడి సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మండల వైద్య అధికారి గొట్టే శ్రావణ్ కుమార్ సూచించారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం , శంకరపట్నం మండలం, ధర్మారం గ్రామంలో కలెక్టర్ ఆదేశం మేరకు ఫ్రైడే, డ్రై డే గ్రామసభ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికి అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక ఆహారాన్ని అందించడం జరుగుతుందని, అర్హులైన ప్రతి



ఒక్కరూ అంగన్వాడీ సేవలను వినియోగించుకొని పౌష్టిక ఆహారాన్ని పొంది. ప్రభుత్వము ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత,ఇంటి పరిశుభ్రత తో పాటు, పరిసరాల పరిశుభ్రత కాలనీల పరిశుభ్రత పాటించి, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ దావాఖానాల్లో కార్పొరేట్ వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రభుత్వము మహిళల ఆరోగ్య రక్షణ కోసం మహిళ హెల్త్ క్యాంపులను మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ మహిళా హెల్త్ క్యాంపులను వినియోగించుకొని తమ ఆరోగ్య అన్ని రక్షించుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ అరుణ, హెల్త్ సూపర్వైజర్ అనిల్, కార్యదర్శి వీర ప్రతాప్, అంగన్వాడీ టీచర్లు గాజుల కాంత, దేవునూరి యశోద, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు ఆయాలు మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ.

**కబురు న్యూస్,వీణవంక ఏప్రిల్ 11**
కరీంనగర్ జిల్లా, వీణవంక మండలం, మల్లారెడ్డిపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం అన్నప్రసాద వితరణను దాతల సహకారంతో చేయుచున్నారు. ఇందులో భాగంగా ఈ శుక్రవారం 8 వ వారం మల్లారెడ్డి పల్లి గ్రామ వాస్తవ్యులు కర్రె స్వస్తిక్ యాదవ్ 14 వ జన్మదినం సందర్భంగా వారి తల్లిదండ్రులు కర్రె మమత - సాయిలు యాదవ్ దంపతులు (హెూంగార్డు) అన్నప్రసాద వితరణ కొరకు 1116/- అందజేనారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ గోనెల సమ్మన్న ముదిరాజ్ మాట్లాడుతు ఇక్కడ స్వయంబు వెలసిన శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రతి శుక్రవారం అన్న ప్రసాద వితరణ చేసి రాత్రి 8 గంటల నుండి 10గంటల వరకు గణేష్ కళాబృందం



కళాకారులచే భజన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.
ఈ ఆలయంలో ప్లాస్టిక్ రహితంగా పర్యావరణాన్ని కాపాడే దిశగా ప్రయత్నం చేస్తూ పేపర్ ప్లేట్లు గాని, ప్లాస్టిక్ గ్లాసులు గాని వాడకుండా మోదుగు ఇస్తార్లలో భోజనం వడ్డిస్తున్నామని తెలియజేశారు. ఈ మంచి కార్యక్రమానికి దాతలు సహకరించాలని కోరినారు.



అమ్మ వారి ఆశీస్సులు ఎల్లవేళలా భక్తులు పైన ఉండాలని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ కళాబృందం అధ్యక్షులు గోనెల పెద్దన్న ముదిరాజ్,కొలిపాక రామస్వామి,కొలిపాక శ్రీనివాస్,బండారి రవి పటేల్, నల్లవెల్లి భవాని శంకర్,గోనెల నర్సయ్య,రాయణవేణి కనుకయ్య,రాయణవేణి అంజి,పూదరి సమ్మయ్య, రాజేష్,అనిల్ , కాంతాల సంపత్ రెడ్డి,ఆలయ అర్చకులు ముక్తవరపు శ్రీధరాచార్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇల్లందకుంట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే ఘనంగా నిర్వహించారు

**కబురు న్యూస్, ఇల్లంతకుంట ఏప్రిల్ 11**
కుల వివక్షకు వ్యతిరేకంగా సమ సమాజం కోసం పోరాడిన బహుజన తత్వవేత్త దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే 198 వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెద్ది కుమార్ కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెద్ది కుమార్ మాట్లాడుతూ దేశానికి జ్యోతిబాపులే అందించిన సేవలను స్మరించుకున్నారు. వర్ణవివక్షను రూపుమాపడం కోసం దళిత బహుజన మహిళా వర్గాల అభ్యున్నతి కోసం ,మహాత్మా జ్యోతిరావు పూలే ఆచరించిన కార్యచరణ మహెూన్నతమైందని తెలిపారు. భారతదేశంలో అట్టడుగు వర్గాల పై జరుగుతున్న దాస్టికాలపై పోరాటం చేసిన వ్యక్తి జ్యోతిరావు పూలే. తన జీవితాన్ని భార్య సావిత్రిబాయి సహకారంతో పోరాటం ప్రతిఘటన సంస్కరణకు అంకితం చేసిన మహెూన్నతుడాయన. కుల లింగ వివక్షతకు తావు లేకుండా విద్యా సమానత్వం ద్వారానే సామాజిక ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయని పూలే ఆలోచన విధానాన్ని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం జ్యోతి బాపులే ను స్మరించుకుంటూ ప్రగతి భవన్ కు మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్ గా నామకరణం చేసుకున్నామని గుర్తు చేశారు. జ్యోతిబాపూలే విద్యా కు ఇచ్చిన ప్రధాన్యత తో వెనబడిన తరగతుల గురుకులాలకు మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులాలుగా ముందుకు వెళ్తున్నాయి. తెలంగాణలో సామాజిక న్యాయం కోసం దేశానికే దిక్సూచిగా తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేసుకున్నామని వెల్లడించారు. బీసీలకు 42% రాజకీయ విద్య ఉద్యోగాలు రిజర్వేషన్లు పెంచడానికి చట్టం చేసుకున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం జ్యోతిరావు పూలే ఆశయాలను ముందుకు



తీసుకుపోతూ సామాజిక న్యాయం ఆర్థిక అభివృద్ధి తదితర అంశాలతో ముందుకు పోతున్నామని వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో కనుమల్ల సంపత్, పెద్ది శివకుమార్, గోలి కిరణ్ , గుడిశాల పరమేశ్వర్ , బొమ్మ శీను , మారపల్లి ప్రశాంత్ , కారింగుల రాజేందర్,మీస రాజయ్య, గంగారపు మహేష్ ,కోడం శ్రీనివాస్, తోడేటి కిషన్ ,గురుకుంట్ల స్వామి , అన్నారపు సాయి, బండి మల్లయ్య ,మ్యాడిద తిరుపతిరెడ్డి, కారెట్ల పెల్లి మణి, మోటపోతుల రాము, దారా నరేష్, జక్కు కుమార్ ,మంకు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు..

# జ్యోతిబా పూలే కు ఘనంగా నివాళులు అర్పించిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు

**కబురు న్యూస్, కరీంనగర్ ఏప్రిల్ 11**
మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ని పురస్కరించుకొని బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కరీంనగర్ లోని జ్యోతిబా పూలే మైదానంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో పూలే 199 జయంతి కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ , రాష్ట్ర కార్యదర్శి కోడూరి పరశురామ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ఎడ్ల అశోక్ , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు లు ముఖ్య అతిధులుగా పాల్గొని పూలే చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని తెలిపారు. సమాజంలోని కులపరమైన వివక్షను రూపుమపడానికి తన జీవితాన్నే ధారపోసిన మహాత్ముడని



కొనియాడారు. చదువు ద్వారానే బీసీలు అభివృద్ధి చెందుతారని ముఖ్యంగా మహిళలు చదువుకోవాలని తన భార్య సావిత్రి బాయి పూలే చదువు నేర్పించి బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన గొప్ప ఆదర్శ మూర్తి అని అన్నారు. పూలే బ్రతికున్నంత కాలం బడుగుల అభ్యున్నతి కి కృషి చేసిన మహనీయులను నవ సమాజ స్థాపనలో భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. తన ఆశయాలను కొనసాగించడం కొరకు ప్రతి బీసీ బిడ్డ ముందుండాలని పిలుపునిచ్చారు. జ్యోతిబా పూలే మైదానంలో పూలే పుణ్య దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేసి వారిని గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మంతెన కిరణ్ , దుప్పటపల్లి మురళి, గుమ్మడి శ్రీనివాస్, సుధాకర్ చారి , బీసీ అఖిలపక్ష నాయకులు సిరి శెట్టి రాజేష్ గౌడ్ మరియు బీసీ సంక్షేమ అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే

**- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

**కబురు న్యూస్, గోదావరిఖని ఏప్రిల్ 11:**
సామాజిక అసమానతల మీద అలుపెరగని పోరాటం చేసి, అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త, మహాత్మా జ్యోతిబా పూలే అని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. పూలే జయంతి సందర్భంగా స్దానిక రాజేష్ దియేటర్ సమీపంలోని ఫ్లులే విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే, మహిళలు, మైనారిటీల విద్య కోసం కృషి చేసిన సామాజిక కార్యకర్త అన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల బాలికల కోసం ఆయన మొదటి పాఠశాలను ప్రారంభించారు



కుల వ్యవస్థను వ్యతిరేకించారని చెప్పారు. వారి ఆశయాల కోసం ముందుకు తీసుకువెళ్లాలన్నారు. రాష్ట్ర మాజీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అదేశాల మేరకు మహత్మ జ్యోతిబా పులే విగ్రహాన్ని ఎర్పాటు చేయడం జరిగిందని కేటీఆర్ ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేయడం జరిగిందని గుర్తు చేశారు. జ్యోతిరావు పులే జయంతి వేడుకలు రామగుండం నియోజకవర్గంలో కన్నుల పండుగగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, మాజీ కార్పోరేటర్ కుమ్మరి శ్రీనివాస్, పెంట రాజేష్, గోపు అయులయ్య, అచ్చే వేణు, బుర్ర వెంకన్న, సట్టు శ్రీనివాస్, ఆర్శనపల్లి శ్రీనివాస్, రామరాజు, కోడి రామకృష్ణ, అవునూరి వెంకటేష్, కిరన్ జీ తదితరులు పాల్గొన్నారు.

# పాదయాత్రను విజయవంతం చేయాలి

**- కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతల రాజేష్, తిప్పారపు శ్రీనివాస్**

**కబురు న్యూస్, గోదావరిఖని ఏప్రిల్ 11:**
భారత రాజ్యాంగ పరిరక్షణ పేరుతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు చేపడుతున్న పాదయాత్రను ఈ ప్రాంత దళిత నాయకులు, స్వచ్ఛంద, యువజన సంఘాల నాయకులు విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతల




రాజేష్, తిప్పారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ఏఐసీసీ పిలుపు మేరకు జై బాపు, జై బీమ్, జై సంవీదాన్, అభయాన్ అనే మూడు ఘట్టాలుగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, హెూం మంత్రి అమిత్ షా పార్లమెంట్ లో భారత రాజ్యాంగాన్ని అమావనపరుస్తూ మాట్లాడడం జరిగిందని తెలిపారు. మొదటి నుండి అంబేద్కర్ విధానాలను, రాజ్యాంగ విలువలను కాంగ్రెస్ పార్టీ కాపాడుతూ వస్తుందని తెలిపారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర శనివారం నుండి ఎమ్మెల్యే చేతుల మీదుగా రామగుండం నియోజకవర్గంలో ప్రారంభమయి వారం రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళిత నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలిపాక సుజాత, పెద్దేల్లి తేజస్విని, నాయిని ఓదెలు, గుండేటి శంకర్, పెద్దేల్లి ప్రకాష్,అల్లి శంకర్, ఆడెపు రవి తదితరులు పాల్గొన్నారు.

# అల్లునూర్ ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా...

**- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి..**

**కబురు న్యూస్, శంకరపట్నం ఏప్రిల్ 11**



అల్లునూర్ గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్లునూరు గ్రామంలో రూ.



105 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు ఆయన సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ ఇప్పటికే అల్లునూర్ గ్రామంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఇక ముందు కూడా గ్రామ అవసరాలు తీర్చి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తానన్నారు. నియోజకవర్గ నిధులతోనే కాకుండా మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో ఇక్కడ చేపట్టే పనులతో అల్లునూరు శకవేగంగా అభివృద్ధి చెందుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.. మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోగల ఈ గ్రామ సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా వివిధ పనుల నిమిత్తం ఇప్పటికే కార్పొరేషన్ నుంచి నిధులు కేటాయించడం జరగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, కంది లక్ష్మినారాయణరెడ్డి, తమ్మనవేణి రమేశ్ యాదవ్. కంది అశోక్ రెడ్డి, ఎల్లారెడ్డి, కొమ్ము శ్రీనివాస్, అనోహర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వంభర రామరామ పాట ప్రోమో విడుదల



కబురు సినిమా ఏప్రిల్ 11: చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం'విశ్వంభర.' యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో అంచనాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం నుంచి తొలి గీతం 'రామ రామ'ను ఈ శనివారం విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా పోస్టర్ రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చిరంజీవి చుట్టూ పిల్లలు హనుమంతుడి వేషధారణలో ఉన్నారు. అలాగే బ్యాక్‌డ్రాప్‌లో రాముడి విగ్రహం ఉంది. 'రామ రామ' పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, ఎం.ఎం.కీరవాణి స్వరపరిచారు. కాగా, ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్ హీరోయిన్లు. కునాల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.

# మే 9ననే హరిహరవీరమల్లు విడుదల


## ర్యూమర్స్‌కు చెక్ పెట్టిన మూవీ మేకర్స్



కబురు సినిమా ఏప్రిల్ 11: పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతోన్న సినిమా 'హరిహర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపొందుతోంది. తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో రిలీజ్ కానుంది. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల అవుతున్నట్లు- ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. అయితే హరిహర వీరమల్లు విడుదల ఆలస్యం కానున్నట్లు- కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ రూమర్స్‌పై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. మే 9న హరిహర వీరమల్లు సినిమాను విడుదల చేయనున్నట్లు- మేకర్స్ సోషల్ మీడియాలో తెలిపారు. 'రీ రికార్డింగ్, డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మెరుపు వేగంతో పనులు దూసుకుపోతున్నాయి. ఈ వేసవికి అద్భుతమైన సినిమాను ప్రేక్షకులకు అందిస్తాము. మే 9న హరిహర వీరమల్లు బిగ్ స్క్రీన్‌లలో విడుదల అవుతుంది. మునుపెన్నడూ చూడని సినిమాటిక్ అనుభూతికి ప్రేక్షకులు సిద్ధంగా ఉండండి' అని మేకర్స్ ట్వీట్ చేశారు. పవన్‌కు సంబంధించిన ఓ కొత్త పోస్టర్‌ను సైతం రిలీజ్ చేశారు. ఈ పోస్టుతో నెట్టింట రూమర్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టారు.హరిహర వీరమల్లు సినిమా రెండు భాగాలుగా రానుంది. తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. ఇందులో పవన్ కళ్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటించారు. అనుపమ్ ఖేర్, బాబీ దేవోల్, నోరా ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్త తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పవన్ ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉండడంతో ఈ సినిమా షూటింగ్ లేట్ అయింది. ముందుగా మార్చి 28న విడుదల చేయాలని భావించినా.. మే 9కు వాయిదా వేశారు.

# ఇన్నాళ్ళకు మళ్లీ ఊపేసింది..

## ఈ బ్యూటీ దెబ్బకు థియేటర్స్‌లో దుమ్ముదుమారం




కబురు సినిమా ఏప్రిల్ 11: సినిమా ఇండస్ట్రీలో చాలా మంది ముద్దుగుమ్మలు స్టార్ హీరోయిన్ రేంజ్ కు వెళ్ళడానికి చాలా ప్రయత్నిస్తూ ఉంటారు. కానీ కొంతమంది భామలకు అదృష్టం కలిసి రాదు. ఎన్ని సినిమాలు చేసినా అవి ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోతున్నారు. సోషల్ మీడియాలో మాత్రం క్రేజీ ఫోటోలు, వీడియోలతో ప్రేక్షకులను కవ్విస్తున్నారు. పై ఫొటోలో కనిపిస్తున్న బ్యూటీ కూడా అంతే.. చేసిన సినిమాలన్నీ డిజాస్టర్స్ కానీ అమ్మడి ఫాలోయింగ్ చూస్తే మతిపోవాల్సిందే. ఈ బ్యూటీ చేసిన సినిమాలన్నీ ప్రేక్షకులను నిరాశపరిచాయి.. కానీ క్రేజ్ మాత్రం కేక. అప్పుడెప్పుడో ఒక్కసారిగా పాపులర్ అయ్యి యూత్ ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇప్పుడు మరోసారి తన డాన్స్ తో మెప్పించింది. ఈ బ్యూటీ దెబ్బకు థియేటర్స్ ఈలలు గోలలతో మారుమ్రోగిపోతున్నాయి. ఇంతకూ ఆమె ఎవరో గుర్తుపట్టారా.? అప్పట్లో కన్ను కొట్టి ఓవర్ నైట్ లో యూత్ లో ఫాలోయింగ్ పెంచుకుంది ఈ క్రేజీ భామ. అప్పట్లో సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఆమె కనిపించింది ఎవరో కాదు హాట్ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్. ఓరు ఆధార్ లవ్ అనే సినిమాతో పరిచయం అయ్యింది ఈ చిన్నది. ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేదు. కానీ ప్రియా ప్రకాష్ కు మంచి క్రేజ్ వచ్చింది. ఈ అమ్మడు కన్ను కొట్టి క్రేజ్ సొంతం చేసుకుంది అప్పట్లో..ఆతర్వాత మలయాళంలో వరుసగా సినిమాలు చేసింది. ఇక తెలుగులో నితిన్ హీరోగా నటించిన చెక్ అనే సినిమాతో అడుగు పెట్టింది. కానీ ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. కేరళకు చెందిన ఈ బ్యూటీ మలయాళ సినిమాలతో పాటు తెలుగు, హిందీ, కన్నడ సినిమాల్లోనూ నటిస్తోంది. ఇక రీసెంట్ గా అజిత్ హీరోగా నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో నటించింది. ఈ సినిమాలో కీలక పాత్రలో ప్రియా ప్రకాష్ వారియర్ నటించింది. కాగా ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ లో ప్రియా తన అందాలతో ఆకట్టుకుంది. గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో ప్రియా ప్రకాష్ అందాలకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. సోషల్ మీడియాలో ఈ చిన్నదాని ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ తెగ వైరల్ చేస్తున్నారు. దాంతో ప్రియా ప్రకాష్ వారియర్ పేరు ఎక్స్ లో ట్రెండింగ్ లో ఉంది. ఇప్పుడు ఎక్కడ చూసిన ఆమె కనిపిస్తుంది.

# నెగెటివ్ ప్రచారాలపై మండిపడ్డ త్రిష



కబురు సినిమా ఏప్రిల్ 11: సోషల్‌మీడియా వేదికగా నెగెటివిటీని వ్యాప్తి చేసే వారిపై నటి త్రిష అసహనం వ్యక్తంచేశారు. వారిది విషపూరితమైన స్వభావం అని పేర్కొన్నారు. ఇతరులపై బురద జల్లడమే వారి పనన్నారు. విషపూరితమైన వ్యక్తులు.. అసలు మీరెలా జీవిస్తున్నారు? మీకు ప్రశాంతంగా నిద్ర ఎలా పడుతుంది? ఖాళీగా కూర్చొని ఇతరులను ఉద్దేశించి సోషల్‌మీడియాలో పిచ్చిపిచ్చి పోస్టులు పెట్టడమేనా మీ పని, మిమ్మల్ని చూస్తుంటే నిజంగా భయమేస్తుంది. అని త్రిష ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. త్రిష ఈవిధమైన పోస్టులు పెట్టడం ఇదేమీ తొలిసారి కాదు. తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే వారిపై గతంలోనూ ఆమె మండిపడ్డారు. వారి ప్రవర్తన ఏమీ బాగోలేదన్నారు. అలాంటి వారి మాటలు పట్టించుకోనని చెప్పారు. ఉన్నట్టుండి త్రిష ఈవిధంగా పోస్టు పెట్టడానికి కారణం లేకపోలేదు. ఆమె నటించిన తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో ఆమె రోల్‌ను కొంతమంది మెచ్చుకుంటున్నారు. ఆమె అందంగా కనిపించారని అంటున్నారు. మరికొంతమంది మాత్రం ఆమె యాక్టింగ్ ఏమీ బాలేదంటున్నారు. తమిళం తెలిసినప్పటికీ సినిమాలోని తన పాత్రకు వేరే వారితో డబ్బింగ్ చెప్పించడం ఏమిటని ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈమేరకు ఆమె గురించి నెగెటివ్ పోస్టులు పెడుతున్నారు.

# మాస్ జాతరతో వస్తోన్న రవితేజ



కబురు సినిమా ఏప్రిల్ 11: వరుసగా చిత్రలు ఫెయిల్ అవుతున్నా...గ్యాప్ లేకుండా సినిమాలు చేస్తూ తన ఎనర్జీని ప్రూవ్ చేస్తూ మాస్ మహారాజా రవితేజ దూసుకెళ్తున్నారు. -టైగర్ నాగేశ్వరరావు, ఈగెల్ సినిమాల తర్వాత మిస్టర్ బచ్చన్ సినిమా ద్వారా ప్రేక్షకులను పలకరించిన రవితేజకు ఆశించిన ఫలితం మాత్రం రాలేదు. దీంతో ఎలాగైనా హిట్ కొట్టాలనే పట్టుదలతో మరో మాస్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఇందులో భాగంగానే భాను బోగవరపు దర్శకత్వంలో రూపొందుతున్న 'మాస్ జాతర' అనే పవర్‌ఫుల్ టైటిల్ పెట్టారు. రవితేజ కెరీర్‌లో ఇది 75వ సినిమా కావడంతో ఫ్యాన్స్‌లో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.సూర్యదేవర నాగవంశీతో పాటు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన శ్రీలీల హీరోయిన్‌గా మరోమారు జోడి కట్టింది. ఇద్దరి ఎనర్జీ కలిసితే స్క్రీన్ మీద పండగే అంటున్నారు ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌కి మంచి ఆదరణ ఉంది. ఇకపోతే తాజాగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్ 'టూ మేరా లవర్' ను ఏప్రిల్ 14 న విడుదల చేయబోతున్నట్టు- చిత్రబృందం ప్రకటించింది. మాస్ బీట్, రవితేజ-శ్రీలీల ఎనర్జీ తో ఈ సాంగ్ సంగీత ప్రియులను ఊపేస్తుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాటకు మాస్ ట్యూన్స్ స్పెషలిస్ట్ భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్, పోస్టర్స్ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. అభిమానులకు ఈ 'మాస్ జాతర' పండుగలా మారనుంది.

# కొత్తగా స్కూల్‌కు వెళుతున్నట్లుగా ఉంది

## దర్శకత్వ బాధ్యతలపై హృత్రిక్ రోషన్



కబురు సినిమా ఏప్రిల్ 11: హీరోగా విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు స్టార్ హీరో హృతిక్ రోషన్. ఇప్పుడీ హీరో దర్శకుడిగా మారనున్న విషయం తెలిసిందే. 'క్రిష్ 4'కు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా దీనిపై ఓ ఈవెంట్‌లో మాట్లాడుతూ.. ఎంతో భయంగా ఉందన్నారు. నాకు దర్శకత్వంపై మొదటినుంచి ఆసక్తి ఉంది. కానీ, ఇప్పుడు భయపడుతున్నాను. మళ్లీ కొత్తగా స్కూల్‌కు వెళ్తున్నట్లు అనిపిస్తుంది. ఎందుకంటే ఇది నాకు పూర్తి భిన్నమైన రంగం. దర్శకుడు అంటే ఎన్నో సవాళ్లు ఉంటాయి. ఎన్నో పరిశోధనలు చేయాలి. భవిష్యత్తులో ఎందుకు దీన్ని ఎంచుకున్నానా అని కూడా అనిపిస్తుంది. ఇలాంటివి ఎన్నో ఎదుర్కోవాలి. అన్నిటికీ సిద్ధపడే దర్శకుడిగా అడుగులు వేస్తున్నా. ఎప్పుడూ మీ ప్రేమను గుర్తుంచుకుంటానని తెలిపారు.ఇక హృతిక్ ఈ సినిమాను ప్రకటించిన నాటినుంచి దీనికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇందులో హృతిక్ త్రిపాత్రాభినయంలో కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. హీరో పాత్రతో పాటు విలన్‌గానూ కనిపించనున్నారట. బాలీవుడ్‌లోని అగ్ర నటీనటులు ఇందులో భాగం కానున్నారట. ప్రీతి జింటా, ప్రియాంక చోప్రా, వివేక్ ఒబెరాయ్, రేఖ ఇందులో నటించనున్నట్లు బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అలాగే ఓ కీలక పాత్రలో నోరా ఫతేహి కనిపించనున్నట్లు- సమాచారం.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com